క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


ఎమ్మెల్యే సిద్దారెడ్డిని సన్మానిస్తున్న జీ-సేవా సభ్యులు

కదిరి టౌన్: పట్టణంలోని సైదాపురం జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చిలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, క్రైస్తవులకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీసస్ ఆశీర్వాదం అందరిపై ఉండి, రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జీసస్ చల్లని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. అనంతరం వేడుకల నిర్వాహణకు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిపై జీసస్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని జీ-సేవా సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్వీట్ తినిపించి, దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు.

కల్తీ ఆహారంపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: కల్తీ ఆహారంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు కల్తీ ఆహారంపై అవగాహన కల్పించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, ప్రిన్సిపాల్ రమేష్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థులు తినే చిరుతిళ్లలో ఏమి కలుపుతారు. వాటి ద్వారా వచ్చే రోగాలు, మోసపోతే కోర్టు ద్వారా ఎలా న్యాయం జరుగుతుందనే విషయాలను తెలియజేశారు. కల్తీ ఆహారాన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సు చార్జీలో రాయితీ


మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్

కదిరి అర్బన్: దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు చార్జీలో 50 శాతం రాయితీ కల్పించడం జరుగుతోందని కదిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మొటుకుపల్లిలో స్పందన మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం దివ్యాంగులకు చార్జీలో రాయితీతో పాటు బస్సులో ప్రత్యేక సీట్లను కేటాయించిందన్నారు. 143 మంది కదిరి డిపో ఆర్టీసీ ఉద్యోగులు ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమానికి ప్రతి నెలా విరాళాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ టీం లీడర్ కేశవమూర్తి, ఏటీఎల్ సుకన్య, లక్ష్మి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన తప్పనిసరి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కదిరి కన్జూమర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొన్న ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తూనికలు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వినియోగదారుల సేవలపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదాత రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మండల పూజలు

కదిరి టౌన్: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ 47వ మండల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు డాక్టర్ శంకరయ్య తెలిపారు. శుక్రవారం ఆలయంలో తిరుమంజనం (ఆలయశుద్ధి) ధ్వజారోహణంతో పూజలు ప్రారంభిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


ధర్మవరం మండలం తుమ్మలలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


ముదిగుబ్బ మండలం మల్లేపల్లిలో పథకాలపై అవగాహన


కదిరి మండలం యర్రదొడ్డిలో మొక్కలు నాటుతున్న నాయకులు

- ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఉత్సాహంగా సాగుతున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు మరో 5 ఏళ్ల పాటు సంక్షేమ పథకాలన్నీ అందాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, పైపల్లి, వెంకటగారిపల్లి గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన పథకాల్లో 99 శాతం నెరవేర్చారన్నారు. లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో వెంగళమ్మచెరువు సర్పంచ్ వెంకటేషు, లోచర్ల మాజీ సర్పంచ్ రాజారెడ్డి పాల్గొన్నారు.

యర్రదొడ్డి గ్రామ సచివాలయంలో..

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గ్రామ సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలందరికి తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మరొక్కసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రకాష్, ఎస్టీ సెల్ నాయకుడు కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి..

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. యర్రవంకపల్లి గ్రామ సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. సచివాలయం పరిధిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల బోర్డు, సచివాలయ ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతకుమార్‌రెడ్డి, నాయకులు జయకుమార్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకట్రమణ, దివాకర్‌నాయక్, జయమ్మ పాల్గొన్నారు.

మల్లేపల్లిలో..

ముదిగుబ్బ: మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలకు కేటాయించిన నిధుల వివరాలను తెలిపే బోర్డు, జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజల మద్దతు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, మాధవ రెడ్డి, భాస్కర్, సేవే నాయక్, రంజిత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మలలో..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని తుమ్మల గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో ధర్మవరం మండలం జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నులక రామయ్య, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ జితేంద్రరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ధర్మవరం: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని వార్డు సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 18వ వార్డులో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. నవరత్నాల్లోని పథకాలతో పేదోళ్ల బతుకులు మారాయని కొనియాడారు. పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలు ఉండకూడదనే జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేశారని వెల్లడించారు. అనంతరం వార్డులో చేసిన అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ఇంటింటా తిరుగుతూ పథకలను వివరించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, ఉడుముల రాము, గుండా ఈశ్వరయ్య, కార్యకర్తలు, పాల్గొన్నారు.


నల్లమాడ మండలం యర్రవంకపల్లి సచివాలయం వద్ద జెండా ఆవిష్కరణ


ధర్మవరం పట్టణం 18వ వార్డులో మాట్లాడుతున్న వార్డు సచివాలయాల కన్వీనర్ సాయికుమార్


పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువులో పథకాలు వివరిస్తున్న కొత్తకోట సోమశేఖరరెడ్డి

10న పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని పాతవూరులో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరాన్ని బ్రహ్మర్షి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు హరిహర ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, గోపాల్, నాగేంద్ర తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10:30కు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి శాఖాహార ర్యాలీతో ధ్యాన మందిరానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా గొట్లూరు వాసి


రవితేజకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన తాడిమర్రి రవితేజ సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రెండు నెలల క్రితం ఎస్ఎస్‌సీ సీజీఎల్ సెంట్రల్ గవర్నమెంట్ శాఖల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆంజనేయులు, గాయత్రి దంపతుల కుమారుడు రవితేజ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యాడు. ఈనెల 4వ తేదీన వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఆలిండియాలో 1,092 ర్యాంకు సాధించి సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

కనగానపల్లి: విద్యాశాఖలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కింద పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మండల ఎంఆర్‌సీ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై గురువారం మండల విద్యాశాఖ అధికారిణి అరుణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి పనికి తగ్గ వేతనాన్ని అందించాలన్నారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చకపోతే ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న సీఆర్పీలు మారుతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

తలుపుల: రానున్న సార్వత్రికల ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టినట్లు కదిరి డీఎస్పీ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించారు. క్రైం రేటు, కేసుల వివరాలపై ఎస్ఐ మగ్బుల్ బాషాను అడిగి తెలుసుకున్నారు. మండలంలో గాంబ్లింగ్, సారా, కర్ణాటక మద్యం నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీలక్ష్మి

ఈవ్ టీజింగ్, బాల్యవివాహాలపై అవగాహన

స్థానిక కేజీబీవీ స్కూల్‌ను కదిరి డీఎస్పీ శ్రీలక్ష్మి సందర్శించారు. ఎస్ఓ మోహనమ్మ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చక్కగా చదువుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

ఫ్యాక్షన్ గ్రామంలో పల్లెనిద్ర..

మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో గ్రామ పరిస్థితులు, నేటి పరిస్థితులపై గ్రామస్తులతో ఆరా తీశారు. మీలో మార్పు మీ బిడ్డల భవిష్యత్తుకు పునాది అవుతుందని తెలిపారు. ఎవ్వరూ అకారణంగా కోపతాపాలకు, ఆవేశాలకు పోయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇలాగే ప్రశాంత జీవనం గడపాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తనకల్లు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు తిరుగులేని శక్తి అని, యువత కచ్చితంగా తమ ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఓటరు నమోదుపై మండల వ్యాప్తంగా బీఎల్ఓలు ఇంటింటా తిరుగుతున్నారన్నారు. అర్హత కలిగిన వారు తమ పూర్తి వివరాలతో ఓటరుగా పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.



తనకల్లు: మాట్లాడుతున్న తహసీల్దార్ శోభా సువర్ణమ్మ

అమడగూరు: ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు శనివారంతో గడువు ముగియనున్నట్లు తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇంతవరకూ ఓటరు కార్డు పొందని వారు రేపటిలోగా కొత్తగా ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఓటరు కార్డులో ఎలాంటి తప్పులున్నా సరిచేసుకోవడానికి, మార్పు చేసుకోవడానికి కూడా గడువు ముగుస్తుందన్నారు. బీఎల్ఓలు త్వరితగతిన మార్పులు, చేర్పులు చేయాలన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని రామమూర్తి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కళ్లిపల్లికి గ్రామానికి చెందిన రామమూర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కదిరి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108లో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

10న ఆరాధనోత్సవాలు

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం సమీపంలోని మహాగణపతి, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీనరసింహ సమేత కాశీనాయన ఆశ్రమంలో ఈనెల 10వ తేదీన 28వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించి, రాత్రికి కాశీనాయన ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. గోపూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు మాల్యవంతం గ్రామంలో ఆణిముత్యాలు డ్రామా ఉంటుందని తెలిపారు.

10న సంగీత విభావరి


కరపత్రాలు విడుదల చేస్తున్న గంటసాల కళారాధన సమితి సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే సంగీత విభావరిని విజయవంతం చేయాలని గంటసాల కళారాధన సమితి సభ్యులు బాలం శ్రీనివాసులు, సోలిగాళ్ల చిన్న వెంకటేషులు, సత్రసాల ప్రసన్న కుమార్ కోరారు. గురువారం స్థానిక సాంస్కృతిక మండలిలో సంగీత విభావరికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం సంగీత విభావరి పాటల కచేరి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓ రమేష్‌రెడ్డి, కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణ హాజరవుతారన్నారు. సంగీత విభావరికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు కేతాగోపాల్, పూజారి రామంజనేయులు, లక్ష్మీనారాయణ, పులిచెర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన లక్ష్మీదేవి గురువారం సాయంత్రం కుటుంబ కలహాలతో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతినగర్‌కు చెందిన లక్ష్మీదేవి తన భర్త మారుతితో వాదులాడుకుని ఇంట్లోని విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

పరామర్శ

నల్లచెరువు: మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ డి.వెవెంకటరమణకు ప్రమాదవశాత్తూ కాలు విరిగింది. బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామం వచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రమణారెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి వెంకటరమణను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, నాయకులు సానే హరినాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, గృహసారథి అమర్‌నాథ్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు


ధర్మవరం అర్బన్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య


బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల అనారోగ్యానికి గురై జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ విష్ణు ఆదేశాలతో వార్డు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య మాట్లాడుతూ .. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలతో కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టం ద్వారా దోషులకు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. ప్రజలంతా శాంతియుతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రమేష్, రమేష్‌బాబు, గిరీష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

బత్తలపల్లి: మత్తు, డ్రగ్స్ పదార్థాలకు బానిస కావొద్దని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. మీరు ఇక్కడే భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. మీరు ఎంచుకునే మార్గం మంచిదై ఉంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం చేసుకోవడంతో పాటు భవిష్యత్ అంధకారం అవుతుందని హెచ్చరించారు. మీపై ఆధారపడిన తల్లిదండ్రులకు భారంగా మారుతారన్నారు. అదేవిధంగా మీ తల్లిదండ్రులు కూడా ఇలా మత్తు, డ్రగ్స్‌కు అలవాటు పడి ఉంటే వారికి అనర్థాలను వివరించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయుల బృందం, కానిస్టేబుల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

అమడగూరు: ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషూరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చినగానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ పరిశీలకుడు డాక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

ధర్మవరం అర్బన్: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు బయట నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేకమైన ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థిరాస్తి విషయంలో తగాదాలు ఏర్పడితే పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధిలో నుంచి తప్పించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యునల్‌కు అప్పగిస్తారన్నారు. ఈ ట్రిబ్యునల్ నిర్ణయంపై అప్పీలు అధికారం హైకోర్టుకు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలతో సంబంధం లేకుండా సహజ న్యాయ సూత్రాల ఆధారంగా తీర్పులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ తీర్పులు రెవెన్యూ అధికారుల విచక్షణపై అవకాశం ఉంటుందన్నారు. ఏకపక్షంగా రూపొందించిన ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో సత్తా

ధర్మవరం: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ధర్మవరంలోని శ్రీపద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం విద్యార్థులను అభినందించారు. మొదటి, ద్వితీయ బహుమతులు సాధించిన లక్ష్మి, ఆయేషా, అర్షియాను సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని సూచించారు.